నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
గురువారం | 05 డిసెంబరు 2024 పేజీలు 8

# పాఠశాల ప్రహరీ గోడ కూలీ బాలిక మృతి



- ఇద్దరు విద్యార్థులకు గాయాలు.. వైద్యశాలకు తరలింపు
- సంఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే
- ఆస్తామహీన్ మృతి చెందడం బాధాకరం..
- కుటుంబాన్ని ఆదుకుంటాం..
- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నందికొట్కూరు మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో గల విద్యానగర్ లోని హాస్టల్ సమీపంలో ఉన్న మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలీ బుధవారం బాలిక మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉర్దూ పాఠశాలలో12 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఓకే ఉపాధ్యాయురాలు

మిగతా 2లో

ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి

# పరిష్కారం ఇవ్వాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** జిల్లాలో ఈ నెల 6తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వతేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూ సమసుయలను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లాలోని 672గ్రామాల్లో ఈ సదస్సును నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు జేసీ కో–ఆర్డినేటర్‌గా ఉంటారన్నారు. రెవెన్యూ సదస్సులు పెద్ద గ్రామాలైతే ఒకరోజు, చిన్న గ్రామాలైతే సగం రోజు నిర్వహించాలన్నారు. ముందుగా రీ సర్వే జరగని గ్రామాల్లో సదస్సులను నిర్వహించాలన్నారు.

మిగతా 2లో

ఆరేసిన పంటల పై రైతులు పట్టాలు కప్పిన దృశ్యం



ధాన్యం తడిసిన దృశ్యం



# ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్‌తో అతలాకుతలమైన పంటలు..

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పంటలు అతలాకుతల మయ్యాయి. ముఖ్యంగా రుద్రవరం మండలంలో తుఫాను తాకిడి అధికంగా ఉంది. సంక్రాంతి పండగకు ముందు చేతికి అందవల సిన వరి పంట తుఫాన్ తాకిడికి పూర్తిగా నేలకు ఒరిగిపోయింది. వేలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లింది. రుద్రవరం మండలంలోని ముత్తలూరు,నరసాపురం, హరినగరం,చిత్రనిపల్లె,

మిగతా 2లో



తుఫాను ప్రభావంతో నేలకొరిగిన వరి పంట

# కృష్ణదాస్‌ను విడుదల చేయండి

- హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో హిందువుల ర్యాలీ
- బంగ్లాదేశ్‌ను రెండుగా చేసి హిందువులకు అప్పగించాలి
- ఇక్కడ వక్ఫ్ పేరుతో..అక్కడ దౌర్జన్యంగా హిందువుల ఆస్తులు స్వాధీనం

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్:** బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన ఇస్కాన్ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో బుధవారం హిందువులు కర్నూలులో ర్యాలీ నిర్వహించారు. వివేకానంద సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగడాలు చేతబట్టిన

మిగతా 2లో




మాట్లాడుతున్న వాసురెడ్డి

# యురేనియం సెగ..



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

- ప్రజలు సిద్ధంగా ఉండండి..తవ్వకాలు నిలిపివేయాలి..
- లేని పక్షంలో ఉద్యమాలే..
- తవ్వకాల విషయంలో కోట్ల,కేఈ,బుగ్గనలను వ్యతిరేకించాలి
- మీకు అండగా ఉంటాం..కేంద్రం మెడలు వంచుదాం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

**ప్యాపిలి,మేజర్‌న్యూస్:** యురేనియం తవ్వకాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కప్పట్రాళ్లలో ప్రజలు ఐక్యమత్యంతో ఉండి తవ్వకాలను నిలుపుదల చేయడం జరిగిందని,అదే తరహాలోనే ప్యాపిలి మండలంలోని

మిగతా 2లో

బంగ్లాదేశ్‌లో హిందువుల పై దాడులను ఖండిస్తూ

# కదంతొక్కిన హిందువులు

- హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ హిందూ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని భరత మాత ఆలయం వద్ద నుంచి ఆర్‌ఎస్ఎస్, ఇతర హిందూ సంస్థలు, ప్రజలు, మహిళలు క్యాండిల్స్ చేత పట్టుకుని భారీ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ భరతమాత గుడి వద్ద నుంచి శ్రీనివాససెంటర్ మీదుగా కల్పనా సెంటర్, గాంధీచౌక్ వద్దకు చేరుకుంది. ఈసందర్భంగా

మిగతా 2లో




క్యాండిల్స్ చేతబట్టి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ భారీ ర్యాలీ చేపట్టిన దృశ్యం

# కృష్ణదాస్‌ను విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్యకర్తలు బంగ్లాదేశ్ డౌన్ డౌన్, హిందూ హిందూ భాయీ భాయీ, భారత్‌మాత్‌కీ జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టరేట్ వద్ద కార్యకర్తలనుద్దేశించి హిందూపరిరక్షణ వేదిక నాయకుడు డాక్టర్ వాసురెడ్డి మాట్లాడుతూ భారత సహకారంతో పాకిస్తాన్ నుండి విడిపోయి ఏర్పాటైన బంగ్లాదేశ్‌లో అక్కడి మైనారిటీలైన హిందువులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని చెప్పారు. హిందువుల ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. హిందూ దేవాలయాలను కూల్చి వేస్తున్న సంఘటనలు నిత్యం కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. బంగ్లాదేశ్ నేత ముజబూర్ రహమాన్ కోసం ఇందిరా గాంధీ ప్రభుత్వం 71వేల పాకిస్తాన్ సైనికులను వదిలేసిందని ఆయన గుర్తు చేశారు. ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగిస్తేనే తమ అధీనంలో ఉన్న సైనికులను విడుదల చేస్తామన్న షరతు విధించి ఉంటే ఇప్పుడు ఆక్రమిత కాశ్మీర్ అనే మాటే ఉండేది కాదని ఆయన చెప్పారు. జమ్మూకే పరిమితమైన టెర్రరిజం గడచిన మూడు నెలలుగా కశ్మీర్‌కు కూడా పాకిందని, ఇప్పుడు అక్కడ మళ్లీ టెర్రరిస్టు కార్యకలాపాలు పెరిగాయని ఆయన వివరించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, అక్కడ ప్రజాస్వామ్యం కనిపించడం లేదని, ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల నోళ్లు మూయించేసారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు పేరుతో భారత్‌లో హిందువుల ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ ఉంటే బంగ్లాదేశ్‌లో మైనారిటీలైన హిందువుల ఆస్తులను కబ్జా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారత్‌లో కూడా హిందువులు సమైక్యంగా ఉండకపోతే బంగ్లాదేశ్‌లో, జమ్మూ, కశ్మీర్‌లో పరిస్థితులను ఎదుర్కోక తప్పదని డాక్టర్ వాసురెడ్డి హెచ్చరించారు. బంగ్లాదేశ్‌ను రెండు ముక్కలుగా చేసి అందులో హిందువులకు ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు భారత్‌లో హిందువులు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఇస్కాన్ నేత కృష్ణదాస్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి అరెస్టు చేశారని, ఆయన తరపున వాదించే న్యాయవాదిని హతమార్చారని, ఇంకో న్యాయవాది ఐసియులో చికిత్స పొందుతున్నారని, బంగ్లాదేశ్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. ఇస్కాన్ జండా కంటే బంగ్లాదేశ్ జాతీయ జండా కొద్దిగా కిందకు ఉందన్న కారణం చూపి కృష్ణదాస్‌పై దేశద్రోహం నేరం నమోదు చేసి అరెస్టు చేశారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో హిందూపరిరక్షణ వేదిక నేత కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపకపోతే భారత్‌లో హిందువులు చూస్తూ ఊరుకోరని, శాంతియుత ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లో హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలు, హత్యాచారాలు పెరిగిపోతూ ఉంటే అరికట్టాల్సిన అక్కడి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆయన ఆరోపించారు. అక్కడి మైనారిటీలను చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆయన చెప్పారు.

# పాఠశాల ప్రహరీ గోడ కూలీ బాలిక మృతి

(మొదటి పేజీ తరువాయి)



విద్యా బోధన నిర్వహిస్తోంది. అయితే పాఠశాల సాయంత్రం 4 గంటల సమయంలో విద్యార్థులను ఇంటికి వదలంతో పాఠశాలలో పనిచేస్తున్న ఆయా గేటు వేసే క్రమంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది . ఆయాతో పాటు ముగ్గురు విద్యార్థులు అక్కడే ఉండడంతో పగుళ్లు ఇచ్చిన ప్రహరీ గోడ ఒక్కసారిగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో అక్కడే ఉన్న విద్యార్థినీ విద్యార్థులపై పడింది. ఈ ప్రమాదంలో రెండవ తరగతి చదువుతున్న ఆస్మామహిన్(8) అనే బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించారు ,విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ కూలి బాలిక మృతి చెందడం బాధాకరం ,జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్,ఆర్డీవో లకు సమాచారం అందించానన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబాన్ని అన్ని విధాలు ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎస్. బేబీ, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఎంఈఓ సుభాన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మొల్ల రబ్బానీ, కౌన్సిలర్ లు మొల్ల జాకీర్ హుస్సేన్, దేశెట్టి సుమలత టిడిపి నాయకులు మందడి రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్ తో అతలాకుతలమైన పంటలు

(మొదటి పేజీ తరువాయి)

ముకుం దాపురం, ఆలమూరు తదితర గ్రామాలలో వర్షం బీభత్సానికి వేలాది ఎకరాలలో కోత దశలో ఉన్న వరి పైర్లు కాస్త పూర్తిగా నేల కొరికిపోవడంతో రైతుల బాధ వర్ణాతీతంగా ఉంది. వరుసగా వస్తున్న తుఫాన్లతో ఈ ఏడాది రైతులకు కడగండ్లు తప్పడం లేదు. వేలాదిరూపాయలు పెట్టుబడులుగా పెట్టి అప్పుల పాలవుతున్న రైతులకు మరోవైపు ములిగే నక్క పై తాటికాయ చందంగా తుఫాన్లు, అకాల వర్షాలు కృంగ తీస్తున్నాయి.

**రోడ్లపై ఆరబోసుకున్న పంటలు వర్షార్పణం :** ఇదిలా ఉండగా ఇటీవల మొక్కజొన్న పైర్లు రోడ్లపై ఆరబోసు కుని వర్షాలతో మొలకెత్తిన సంఘటనను మర్చిపోకముందే మరోవైపు రోడ్లపై వరి ధాన్యాన్ని ఆరబో సుకున్న రైతులు కూడా పంటలు తడిసిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టార్పలిన్ పట్టలు కప్పి ఉంచినప్పటికీ వర్షం తాకిడికి లోపలికి నీరు ప్రవేశించి ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆళ్లగడ్డ ప్రాంత రైతులు కోరారు.

# ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ సదస్సుల్లో ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కారం ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పాల్గొనేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌వో వెంకటనారాయణమ్మ, ఆయా పార్టీల నాయకులు రాఘవేంద్ర, ప్రసాద్, సాయిప్రదీప్, రామక్రిష్ణ, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయాలకు సహకరించండి – ఏడీఈలు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణం, చుట్టుపక్కల మండలాల్లో డిసెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తు కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని పట్టణ, రూరల్ ఏడీఈలు పి రమేష్‌కుమార్, ఎన్ సుబ్రహ్మణ్యంలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలో 220/132/33 కేవీ సబ్ స్టేషన్ నందు 3 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లలో మరమ్మత్తులు జరుగుతాయని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రజలు సహకరించాలని కోరారు. నంద్యాల, మహానంది, బండిఆత్మకూరు, పాణ్యం, వెలుగోడులలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని అన్నారు.

# యురేనియం సెగ..

(మొదటి పేజీ తరువాయి)

జక్కసానికుంట్ల, మామిళ్ళపల్లె, రాంపురం గ్రామాలలోని యురేనియం తవ్వకాలను అడ్డుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని జక్కసానికుంట్ల గ్రామంలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రామాంజినేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నారాయణలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ యురేనియం తవ్వకాలను కప్పట్రాళ్ళలో ఎందుకు నిలిపివేశారు, ఇక్కడెందుకు మొదలు పెట్టాలనుకుంటున్నారు, తవ్వకాలను నిలిపివే వరకు గ్రామాల ప్రజలకు సిపిఐ అండగా నిలుస్తుందని ప్రజలు సైతం ఉద్యమించడానికి సిద్దంగా ఉండాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి సిపిఐ తరపున ప్రత్యేకంగా లేఖరాస్తానన్నారు. అలాగే డోన్ నియోజకవర్గానిన ఏలినటువంటి కోట్ల, కేఈ, బుగ్గనలు సైతం యురేనియం తవ్వకాల విషయాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. అలాగే యురేనియం తవ్వకాల విషయంలో ప్రజలు సైతం ఉద్యమాలకు సిద్దంగా ఉండాలని, పోరాట మార్గం ద్వారానే జిల్లా, రాష్ట్రం వరకు ప్రజల గొంతుకను వినిపించి, కేంద్రం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. యురేనియం తవ్వకాలు జరిగే ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు


సభకు తరలివచ్చిన మూడు గ్రామాల ప్రజలు

గురౌతారని, తవ్వకాలు జరిగితే అనారోగ్యాలకు గురైతే ఎవ్వరు ఆదుకోరని, అందుకే ఇతర దేశాలలో యురేనియం తవ్వకాలను నిషేదించారని, కాని మన దేశంలో మాత్రం పాలకులు ఎందుకు అనుమతులు ఇస్తున్నారో అర్థం కావడంలేదని, ప్రజల ప్రాణాలపై మన నాయకులకు అంత అలుసా అని ధ్వజమెత్తారు. కావున యురేనియం తవ్వకాలను నిలిపే వరకు సిపిఐ పార్టీ ప్రజలకు అండగా నిలుస్తుందని, ప్రాణాలను సైతం పన్నంగా పెడుదామని కాని తవ్వకాలను జరగనివ్వకుండా అడ్డుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నబిరసూల్, బాబాఫకృద్దీన్, మోటా రాముడు, రఘురాంమూర్తి, నాగరాముడు, ధనుంజయుడు, మహేష్‌యాదవ్, రామకృష్ణ, ఆదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాంపురం నాగేశ్వరరావు, రాజు, జక్కసానికుంట్ల, రాంపురం, మామిళ్ళపల్లె గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ కదంతొక్కిన హిందువులు

(మొదటి పేజీ తరువాయి)

హిందూ పరిరక్షణ వేదిక సభ్యులు డాక్టర్ ఉదయ్ శంకర్, న్యాయవాది రావినూతనల దుర్గా ప్రసాద్, బీజేపీ నాయకులు అభిరుచి మధు, సుధాకర్, తదితరులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో కొన్ని మతోన్మాద ఉగ్రవాదులు ఆ దేశం నుంచి హిందువులను తరిమికొట్టాలనే ఉద్దేశంతో అక్కడ నివశిస్తున్న హిందువులు, దేవాలయాలపై, అన్నమో రామచంద్ర అన్నవారికి అన్నం పెట్టే అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థపై దాడులు చేయడమే కాకుండా అక్కడ ఉన్న ప్రభుపై బంగ్లాదేశ ప్రభుత్వం దేశద్రోహం కేసులు పెట్టి జైలులో పెట్టడం చూస్తుంటే ఉగ్రవాదం ఎంత పెరిగిపోయిందో అర్థమవుతుందన్నారు. మహిళలపై అత్యాచారాలు, హిందువులపై దాడులు నశించాలని ప్లేకార్డులతో నిరసన తెలిపారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఉర్దూ మీడియం ప్రవేశపెట్టి వారిలో ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విధంగా చేయడం దురదృష్టకరమన్నారు. బంగ్లాదేశ్ ఈరోజు ఆవిధంగా ఉందంటే అక్కడ ఉన్న హిందువులే కారణమన్నారు. ఈరోజు హిందువులపై దాడులు


హిందూ కషాయ జెండాలతో క్యాండిల్స్ చేతపట్టుకుని ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

ఎందుకు జరుగుతున్నాయంటే ఈశాన్య రాష్ట్రాన్ని మనదేశం నుంచి విడగొట్టాలనే దుర్మార్గమైన ఆలోచనలో ఉగ్రవాద సంస్థలు ప్రయత్నిస్తున్నాయన్నారు.


మాట్లాడుతున్న హిందూ పరిరక్షణ వేదిక సభ్యులు డాక్టర్ ఉదయ్ శంకర్, తదితరులు

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై హిందువులు ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.

# బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** రబీలో రైతులు వేసిన శనగ, జొన్న, పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హుసేనాపురం, కాల్వ, గ్రామాల్లో మండల వ్యవసాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, సహాయ సంచాలకులు ఎన్ సాలు రెడ్డి, ఎల్డిఎం లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది, శనగ పంటల్లో పురుగు నివారణ తెగుళ్ల గురించి రైతులకు తెలియజేశారు, అదేవిధంగా గంజాయి సాగు వల్ల కలిగే దుష్ఫలితాల గురించి తెలియజేస్తూ రైతులు గంజాయి సాగు ఎవరు కూడా చేయకూడదని తెలియజేశారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ కౌలు రైతులకు అన్ని బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తున్నామని కౌలు రైతులు రైతు సేవా సిబ్బంది, బ్యాంకులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ ఎల్ సి కర్నూల్ లక్ష్మణ్, ఏపీజీబీ



హుస్సేనాపురం బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన సురక్షణ పథకాలు జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ముద్ర లోన్ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా సిబ్బంది గంగాధర్, భువనేశ్వరి,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గజ్జహళ్లి రోడ్డు మరమ్మత్తుకు

# రూ.62 లక్షల నిధులు మంజూరు



రోడ్డు మరమ్మత్తుకు నిధులు మంజూరైనట్లు పత్రం చూపిస్తున్న దృశ్యం

**హొళగుంద, మేజర్‌న్యూస్:** హొళగుంద మండలం గజ్జహళ్లి నుండి శిరుగుప్ప క్రాస్ వరకు ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మత్తుకు రూ. 62 లక్షల నిధులు మంజూరైయ్యాయని బిజేపి కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చాకలి రామలింగ తెలిపారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్డును మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గజ్జహళ్లి నుండి శిరుగుప్ప క్రాస్ వరకు ఉన్న 6.3 కిలో మీటర్ రోడ్డు మరమ్మత్తుకు నిధులు మంజూరైనట్లు ఇంజినీయర్ సాయి సురేశ్ తెలిపారన్నారు. ఆ మేరకు రోడ్డు మరమ్మత్తు పనులను బుధవారం మొదలు పెట్టినట్లు చెప్పారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిధులను మంజూరు చేసి రోడ్డు మరమ్మత్తులను మొదల పెట్టడంతో ఆయన ఆధికారులకు ఈ సందర్భంగా రామలింగ కృతజ్ఞతలు తెలిపారు.

## చాబోలులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా చాబోలు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఇలియాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇలియాస్ అన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకై నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు సద్దాం, గ్రామ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఇలియాస్

### అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో

## పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులు పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎ.ఒ

**అవుకు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో వివిధ రకాల పంటల సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ముఖ్యంగా వరి పైరు కోత దశలో ఉన్నందున నీరు నిల్వ కుండా నీటిని తీసి వేయాలని అలాగే గాలులకు నేల రాలిన పైరును కట్టలుగా కట్టుకోవాలని కట్టలను తడవకుండా జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. తడిసిన వరి ధాన్యంపై 5శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవడం ద్వార గింజలు, మొలకలు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. పంటల భీమా ప్రీమియం చెల్లించడానికి ఈ నెల 15 వరకు సమయం ఉన్నందున రైతులు తమ ప్రాంతాలలో రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

# గుండెపోటుతో రైతు మృతి

**సి.బెళగల్ క్రైమ్ న్యూస్ :** మండల పరిధిలోని మారం దొడ్డి గ్రామానికి చెందిన చేరుకులపాడు బోయ బతుకన్న(49)మంగవారం గుండె పోటుతో మృతి చెందారు. రాబడిన సమాచారం మేరకు మారం దొడ్డి గ్రామంలో రెండు ఎకరాలు, చేరుకులపాడులో రెండు ఎకరాలు వ్యవసాయ భూమిని వ్యవసాయం చేసుకుంటు వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి గత నాలుగు సంవత్సరాల నుండి పంటలలో దిగుబడులు రాక అప్పులు తెచ్చి పంటలు పండించేవాడు. పేరుక



మృతుడు చేరుకులపాడు బోయబతుకన్న

పోయిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర ఒత్తిడికి గురై మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు కలరు. బతుకన్న టిడిపి కార్యకర్తగా పనిచేశారని. మృతుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.




## యాగంటి కోనేటిలో వ్యక్తి మృతి

**బనగానపల్లె, మేజర్‌న్యూస్:** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలోని పెద్ద పుష్కరిణిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారంనాడు చోటుచేసుకుంది. గుంతకల్లు మండలం పాత కొచ్చెరువు గ్రామానికి చెందిన బోయ సురేంద్ర యాగంటి ఉమామహేశ్వరస్వామి దర్శనానికి వచ్చి పెద్ద పుష్కరిణిలో ప్రమాదవశాత్తు మునిగి చనిపోవడం జరిగింది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మృతి చెందిన బోయ సురేంద్ర

## నగరంలో రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

### – రెండు చోట్ల దొంగతనం

### – 9.5తులాల బంగారు గొలుసులు అపహరణ

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు నగరంలోని బుధవారం చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. త్రీటౌన్, తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలో చోరీలు చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ తహసీల్దార్ చెంచమ్మ ఉదయం పాల కోసం నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 3.5 తులాలబంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. తాలూకా పోలీసుస్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో నివాసముంటున్న నారాయణమ్మ తమ ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా కేటీఎం టూవీలర్‌పై దొంగలు వచ్చి ఆమె మెడలోని 6 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. బాధితులు 3, 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## చున్నీతో ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థిని

**ఆళ్లగడ్డ, మేజర్‌న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన ఆదిలక్ష్మి, ఓబులేసుల కుమార్తె అయిన నందిని (13) బుధవారం చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఒక ప్రైవేట్ స్కూల్లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థినిని తల్లి పరీక్షలకు వెళ్ళమని మందలించడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి పాపను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

## నాపరాయి బండ పడి చిన్నారి మృతి

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** బేతంచర్ల పట్టణంలోని డోన్ కు వెళ్లే రహదారిలో గల ఒక పాలిష్ ఫ్యాక్టరీ ఆవరణంలో నాపరాయి బండ పడి చిన్నారి (యామిని )మృతి చెందినసంఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల మేరకు కొలుములపల్లె గ్రామానికి చెందిన చిన్న మద్దయ్య, సువర్ణ, దంపతులు బేతంచెర్ల పాలిష్ ఫ్యాక్టరీలో కూలిపని చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే యధావిధిగా బుధవారం వారితో పాటు కూతురు యామిని (5)ని తీసుకువెళ్లారు. భార్యాభర్తలు పనిలో నిమగ్నమై ఉండగా పాప ఆడుకుంటూ నాపరాయి బండను పట్టుకోగా బండ ఒరిగి చిన్నారిపై పడడంతో గమనించిన తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



**గడివేముల, మేజర్‌న్యూస్:** కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గడివేముల మండలం లోని గని గ్రామానికీ చెందిన దేవనూరు శివలక్ష్మి, (30) ఆమె గత కొంత కాలం నుండి కడుపు నొప్పి తో భాద పడుతూ వుండేదని, గత నెల 29 వ తేదీన విపరీతమైన కఢుపు నొప్పి రావడం తో చనిపోవాలనే ఉద్దేశ్యం తో జీవితం పైన విరక్తి చెంది ఇంట్లో కంది పంటకు కొట్టే పురుగుల మందు సేవించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికత్స నిమిత్తం ఓర్వకల్లు ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు లో ప్రైవేటు హాస్పిటల్లో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకో లేక మంగళవారం చనిపోయిందని, మృతురాలు తండ్రి కాటినేని గోవింద్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సి సి నాగార్జున రెడ్డి తెలిపారు.

సూర్య

గురువారం | 05 డిసెంబర్ 2024



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## అపర చాణక్యుడు కొణిజేటి రోశయ్య

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** అపర చాణక్యుడు కొణిజేటి రోశయ్య అని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొణిజేటి 3వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌బాబు రోశయ్య 1933లో పుట్టి అంచెలంచెలుగా ఎదిగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా 15సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, బతుకన్న, సుంకన్న, షేక్‌ఖాజాహుసేన్, ప్రమీల, సత్యనారాయణగుప్తా, కురువ నాగశేషు, ఎజాయ్‌అహ్మద్, సత్యరాజు, జాన్‌సదానందనం, పసుపల ప్రతాప్‌రెడ్డి, షేక్‌మాలిక్, ఆర్.ప్రతాప్, ఆనందం, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## రహదారి నిర్మాణం చేపట్టాలి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగరంలోని సంతోష్‌నగర్‌లోని డి.మోసెజ్‌నగర్‌లో రహదారి అధ్వాన్నంగా ఉందని, సీసీ రోడ్డు నిర్మించాలని అక్కడి స్థానికులు నగర పాలక సంస్థ కార్యాలయ మేనేజర్ ఎస్.చిన్నరాముడును కోరారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో స్థానికులు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమలలో రియాజ్, మహబూబ్‌బీ, సుశీల, ధీరజ్ పాల్గొన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## 8న కర్నూలు జడ్పీ సర్వసభ్య సమావేశం

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వతేదీన ఉదయం 11.00గంటల నుంచి జడ్పీ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, విద్యుత్‌శాఖలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు, జడ్పీ సభ్యులు హాజరవుతారన్నారు.

## ఆత్మకూరు టౌన్ సిఐగా రాము



ఆత్మకూరు టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన రాము

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి. రాము బుధవాం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసు బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో నూతన సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా రాము బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల, కింది స్థాయి సిబ్బంది సహాయ సహకారాలతో శాంతిభద్రతలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ ప్రజలకు రక్షణ కల్పించడంలో అంకితభావం, నిఖచ్చిగా విధులు నిర్వహిస్తానని అన్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించడమే ధ్యేయమని అన్నారు.

## వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవాలి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కర్నూలు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాల పెంపుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి స్వగృహంలో ఆమెను కలిసి అందజేశారు. వేతనాలు పెంపు చేయకపోతే ఈ నెల 9వతేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## కమ్మేసిన పొగమంచు..!

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం ఆరుగంటల నుంచి ఎనిమిది గంటల వరకు 10 అడుగుల దూరంలో ఉన్నవి కనిపించనంతగా మంచు కప్పేసింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణం సాగించారు. పట్టణ శివారులోని కర్నూలు బైపాస్ రోడ్డు, ఆదోని రోడ్డు, గుడికల్లు రోడ్డు, మంత్రాలయం ప్రధాన రహదారులను పొగ మంచు కప్పేసింది. చలి త్రివతకు రహదారులను పొగమంచు కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



రహదారులను కమ్మేసిన పొగమంచు

## ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఘనత ఘంటసాలదే



ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**ఆదోనిరూరల్, మేజర్‌న్యూస్ :** సినీ ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఘనత ఘంటాసాలదేనని ఘంటసాల సప్తస్వరాల కళా సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు నీలకంఠప్ప, మల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బసవరాజుస్వామిలు పేర్కొన్నారు. బుధవారం ఘంటసాల 102వ జయంతి సందర్భంగా, చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1922 డిసెంబరు 4వ తేదిన కృష్ణాజిల్లా చౌటు పల్లి గ్రామంలో సూర్యనారాయణ రత్నమ్మ దంపతులకు వెంకటేశ్వరరావు జన్మించారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా సంగీత సాధనలో శాస్త్రీయ సంగీతం శిక్షణతోనే తెలుగు సినీ సంగీత ప్రపంచంలోనే ఎనలేని సేవలు చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. భారత ప్రభుత్వం వారి సేవను గుర్తించి 1970లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించారు. 2003 పోస్టల్ స్టాంపులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల నాయకులు ఫీరోజ్ అహ్మద్, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీధర్ గౌడ్, సాయినాథ్, రాముడు, దాదాబాష,తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** ఈ నెల 14వతేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ది ఆదేశాల మేరకు బుధవారం న్యాయసేవ సదన్‌లో జాతీయ లోక్‌అదాలత్‌పై జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ జ్యోత్స్నాదేవి, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ సరోజినమ్మ మాట్లాడుతూ పోలీసులు వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విదంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేవంలో కర్నూలు టౌన్ సీఐలు, ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలావెంకటశేషాద్రి

డిసెంబరు 6వ తేదీ నుండి

## రెవెన్యూ సదస్సులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** భూ సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 6 నుండి జనవరి 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. 6వ తేదీన మాయలూరు, 7 హరివరం, 10 అల్లూరు, 11 తుడుమలదిన్నె, 12 ఎస్. కొత్తపల్లె, 13 ఆర్. పాంపల్లె, 17 సర్వాయిపల్లె, 18 ఉయ్యాలవాడ, 20 పెద్ద యమ్మనూరు, 21 బోడెమ్మనూరు, 27 పడిగెపాడు, 28 ఆర్. జంబులదిన్నె, వెంగంపల్లి, 31 ఇంజెడు, జనవరి 2న కొండుపల్లె, 4 కాకరవాడ, 7న రూపనగుడి, గోవిందపల్లె, 8న సుద్దమల్ల, నర్సిపల్లె గ్రామాల్లో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

5, 6న స్థానికీరణ, పంచాయతీ సుస్థిర

## అభివృద్ధిపై శిక్షణ

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీరాజ్ సిబ్బందికి ఈ నెల 5, 6వతేదీల్లో డీపీఆర్‌సీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాల్లో బీఎల్‌ఎంటీఎస్ శిక్షణ ఉంటుందన్నారు. ఆయా శాఖలకు సంబంధించి ఒకరు చొప్పున మండలానికి 6మంది బీఎల్‌ఎంటీఎస్‌ల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పంచాయతీల అభివృద్ధి కోసం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

వెలుగు సిబ్బందిపై దాడి చేసిన వారిని

## కఠినంగా శిక్షించాలి

**పత్తికొండటౌన్, మేజర్‌న్యూస్:** వెలుగు సిబ్బందిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపిఎం చక్రిధర్, సిసి శేషప్ప, విఓ అధ్యక్షురాలు లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ, పత్తికొండలోని సభ్యులతో మాట్లాడుతుండగా, గతంలో వెంకటేశ్వర పొదుపుగ్రూపుకు విఓఏలుగా పనిచేసిన నరేంద్ర, పురుషోత్తం, కృష్ణావేణి కుటుంబసభ్యులు కలిసి ప్లాన్ ప్రకారంగా విధి నిర్వాహణలోసిసి శేషన్నపై దాడి చేశారన్నారు. వారు ఏదైనా ఉంటే వ్యక్తిగతంగా చూసుకోవాలేతప్ప సిబ్బందిపై దాడులు చేయడం సరికాదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేసిన వారు ఎంతటివారైనా ప్రభుత్వం సహించదని,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఉద్యోగ సిబ్బందికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది నరసన్న, చక్రిధర్, అరుణ, ముద్దు, రంగడు, జనార్ధన్, రామాంజనేయులు, ఈరన్న, రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వెలుగు సిబ్బంది

## బహిరంగ వేలం లో రూ .9200 ఆదాయం



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** కాల్వబుగ్గ లో వెలిసిన బుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో 9200 రూ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు. దేవాదాయశాఖ అధికారులఆధ్వర్యంలో దేవాలయంలో కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, మూడో నెంబర్ షాపులో వ్యాపారాలు నిర్వహించేందుకు వేలం పాటలు నిర్వహించగా, రవికుమార్ గౌడ్ కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకునేటకు 13 వేలకు దక్కించుకోగా ఎస్ భాస్కర్ మూడో షాపులో వ్యాపారం నిర్వహించుకొనే హక్కును 50 వేల రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ రమేష్, ఆలయ సిబ్బంది, వేలం పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రులలో

## వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి



చిల్లపల్లి శ్రీనివాస్‌రావును కలిసిన తెర్నేకల్ వెంకప్ప

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు నియోజకవర్గంలో ఆరోగ్య సంరక్షణకు సంబంధిత సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని ఏపీ మెడికల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మెన్ చిల్లపల్లి శ్రీనివాస రావును ఆలూరు జనసేన ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం మరియు వైద్య సేవల్లో కొరత ఉన్న నేపథ్యంలో వీటిని అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, నియోజకవర్గంలోని ఆసుపత్రుల సమస్యలను పూర్తి వివరాలతో ఒక నివేదిక రూపంలో సిద్ధం చేసి త్వరలోనే అందజేస్తామని తెలిపారు. ఇది ప్రజల ఆరోగ్య హక్కులను పటిష్ఠం చేయడానికి జనసేన పార్టీ తీసుకున్న నిర్ణయమని జనసేన ఇంచార్జ్ వెంకప్ప తెలిపారు.వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో అత్యవసర చికిత్సలకు 50 నుండి వంద కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు సర్జరీ చేయడానికి కూడా అనుకూల పరిస్థితులు కల్పించాలని కోరారు.

## టీడీపీలో చేరిన నాగంపల్లి వైకాపా నాయకులు



మద్దిలేటికి కండువ కప్పుతున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ పార్టీ నాయకుడు మద్దిలేటి తోపాటు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మస్తాన్, సాంబశివుడు, పలువురు వైఎస్ఆర్ పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆధ్వర్యంలో మండల కన్వీనర్ నారపురెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం అల్లూరులోని మద్దిలేటికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే జయసూర్య పార్టీలో చేర్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ పథకాలకు ఆకర్షితులై గ్రామ అభివృద్ధి కోసం పార్టీలో చేరినట్లు మద్దిలేటి తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఈనెల 6నుండి గ్రామ రెవిన్యూ సభలను

## సద్వినియోగం చేసుకోండి

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** రెవిన్యూ గ్రామ సభలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓలకు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేది నుండి జనవరి 7వ తేది వరకు రెవిన్యూ గ్రామ సభలను నిర్వహిస్తారన్నారు. భూములకు సంబంధించి సమస్యలుంటే వారు సభకు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

## ఆలూరు అభివృద్ధికి తోడ్పాటు అందించండి

### జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషను కోరిన వైకుంఠం దంపతులు



జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను కలిసిన వైకుంఠం దంపతులు

**ఆలూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఆలూరు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నామని అందుకు తమ వంతు సహకారం అందించాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం ప్రసాద్,జ్యోతి దంపతులు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను కోరారు.ఈ సందర్భంగా బుధవారం కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలో టీడీపీ నాయకులు వైకుంఠం ప్రసాద్, జ్యోతి దంపతులు జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గం ఆలూరు ను ప్రగతి పథంలో నడపాలని అలాగే ఇప్పటివరకు చాలా గ్రామాల్లో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన ఎండియు ఆపరేటర్లు వాహనాలను ఇంటి వద్ద ఉంచుకొని వేతనాలు తీసుకుంటున్నారని వారి వేతనాలను రికవరీ చేయాలని పనిచేయకుండా జీతాలు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే వేదావతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు అందించాలని దీనిపై సీఎం దృష్టికి తీసు కెళ్లాలని అన్నారు.సమస్యలను విన్న జిల్లా కలెక్టర్ ఆలూరు అభివృద్ధి కి తగినన్ని నిధులు అందిస్తామని తెలిపినట్లు వైకుంఠం దంపతులు తెలిపారు.

## 3,456 మంది విద్యార్థులతో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

### – డీఈఓ జనార్ధన్‌రెడ్డి



విద్యార్థుల సర్వేను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జాతీయ విద్యా పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా 3,456మంది విద్యార్థులతో సర్వే నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 137 పాఠశాలల్లో 3,5,9 తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇందుకు పరిశీలకులకు, క్షేత్ర పర్యవేక్షకులకు ముందుగానే తగిన శిక్షణ ఇచ్చి ఈ సర్వే నిర్వహించామని, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేయుటకు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ సర్వే నిర్వహించి సర్వే ఫలితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన పాఠ్య ప్రణాళికలు రూపొందించుటకు తగిన నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. శ్రీశైలం మండలంలోని వివిధ పాఠశాలల్లో పరీక్ష తీరుతెన్నులను, శిరివెళ్ళ మండలంలోని వివిధ పాఠశాలలను ఏఎంఓ లలిత కుమారి సందర్శించారు.

## వరి సాగు చేసిన రైతులను ఆదుకోండి

### – బనగానపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ బాలుయాదవ్



మాట్లాడుతున్న బాలు యాదవ్

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ఈ ఏడాది సాగు చేసిన వరి రైతులు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోతున్నారని బనగానపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గూటం బాలు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వరి పంట కోత దశలో అకాల వర్షాలు కురియడంతో వరి ధాన్యం తడిసి కొన్ని మొలకలెత్తి రైతులకు తీవ్ర నష్టాల పాలు చేసిందని, నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వరి క్వింటాల్ ధర రూ.1200 నుంచి రూ.1400 లోపు ఉండటం వల్ల రైతులకు పెట్టుబడి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల లోపు ఖర్చు వచ్చిందని, దీంతో రైతులకు ధాన్యానికి తగ్గ గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల కోసం అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ప్రకటనలు ఇస్తున్నారే తప్ప రైతులను ఆదుకోవడం లేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. వరికి మద్దతు ధర లేకపోవడంతో ఈ ఏడాది వరి సాగు చేసిన రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, అప్పులపాలై ఆత్మహత్యలే శరణ్యమంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల బాధలను గుర్తించి ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు గిట్టుబాటు ధర ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## గూళ్యంలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

### సిసి రోడ్డు పనులను పరిశీలించిన ఎంపిడిఓ వరలక్ష్మి



కాలనీలో సిసి రోడ్డు వేస్తున్న దృశ్యం



గూళ్యంలో సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ వరలక్ష్మి

**హొలహర్వి, మేజర్‌న్యూస్:** హొలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో 50 లక్షల తో సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్లు టీడీపీ నాయకులు పాలాక్షి, పూజారి మల్లప్ప, పంపన్న, మాజీ జడ్పిటిసి రాజశేఖర్ గౌడ్, లింగ మల్లప్ప, మాభాష, షాసాబ్, దిబ్బలింగ, బసవన్న గౌడ్, వన్నూరు, మాబు, పింజరి ప్రకాష్, చాకలి వీరేష్, రాజా సాబ్, గాదిలింగ, మారెన్న, లక్ష్మీ కాంత్, సోమలింగ, పాపా రాయుడు, నీలధర, రఫీక్ లు తెలిపారు. బుధవారం హొలహర్వి మండలంలోని గూల్యం గ్రామంలో వాల్మికి సర్కిల్, దూదేకుల కాలనీలలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఎంపిడిఓ వరలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు,డ్రైనేజీ పనులను చేపట్టారు. గ్రామంలో కాలనీ ఏర్పాటు అయినప్పటి నుండి ఇప్పటి వరకు కాలనీలో డ్రైనేజీ కూడా ఏర్పాటు చేయలేదని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో డ్రైనేజీ,సిసి రోడ్డు పనులను చేపట్టారని రాబోయే కాలంలో మరిన్ని నిధులతో గ్రామంలో అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదన**
**ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే బీవీ**



హెచ్ డిసి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని, ఇందులో భాగంగానే ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి అతి త్వరలోనే ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం అయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ముందుగా వైద్యులతో హెచ్‌డిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే నూతన 100 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నా తండ్రి మాజీ మంత్రి బివి మోహన్ రెడ్డి హయాంలో మంజూరు చేసిన వంద పడకల ఆసుపత్రి కూటమి ప్రభుత్వంలోప్రారంభం అవుతుందన్నారు.ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. మంత్రాలయం, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు మధ్యలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి ఉందని, ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఇక్కడ వైద్యం అందించేందుకు ట్రామా కేర్ సెంటర్ ఎంతో ఉపయోగమన్నారు. దీని ద్వారా ఎమర్జెన్సీ వైద్యం అందించేందుకు సులభం అవు తుందన్నారు. ఇందుకు ప్రతిపాదన కూడా పెట్టడం జరిగిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి గురించి శాసనసభల ప్రస్తావించడం జరిగిందని, సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సుధా, వైద్యులు మల్లికార్జున, బాలయ్య, రవికుమార్, వీరేష్, శ్రీ చరణ్, ప్రియాంక, సమీరా, హెచ్ డిసి కమిటీ సభ్యులు రామకృష్ణ నాయుడు, సురేష్ చౌదరి, అంబేద్కర్, టిడిపి నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబరు 15లోగా రైతులు పంటల భీమా చేసుకోవాలి

**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** రైతులు డిసెంబరు 15లోగా పంటల భీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. ప్రమీళ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని అమ్మినగరం, అర్జునాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు. అలాగే రైతులకు వరి పంట సాగులో యాజమాన్య పద్దతులపై క్షేత్రస్థాయిలో వివరించడం జరిగింది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల




పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు

మేరకు పంటను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శనగ, జొన్న, మినుము పంట వేసిన రైతులు తక్కువ ప్రీమియంతోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అవకాశం కల్పించారని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. అలాగే రైతులకు పంటల దిగుబడులు తగ్గడానికి గల కారణాలను వివరించారు. భూసారం పెంచేలా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి చర్యలు చేపడతామని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని వి. ప్రమీళ, వ్యవసాయశాఖ సిబ్బంది ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి

**డోన్ సబ్ డివిజన్ ఇంజనీర్ నాగేంద్ర**
**డోన్, మేజర్‌న్యూస్‌:**

సూర్యఘర్ స్కీం గురించి విద్యుత్ వినియోగదారులకు, ప్రజలకు అవగాహన కల్పించి వారి వద్ద నుండి స్కీంకు సంబందించిన దరఖాస్తులను విద్యుత్ వినయోగదారుల నుండి నమోదు చేయించాలని డోన్ సబ్ డివిజన్ ఇంజనీర్ నాగేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణం నందు డోన్ పట్టణం, రూరల్ విద్యుత్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ ద్వారా ఇంటిపై 10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకొని ఈ సోలార్ సిస్టం ద్వారా మొదటి 3 యూనిట్లు విద్యుత్ వినియోగదారుడు ఉచితంగా వినియోగించుకోవచ్చని, మిగిలిన యూనిట్లని నెట్ మీటరింగ్ ద్వారా అమ్ముకోవచ్చన్నారు. అలాగే మూడు కిలోవాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రూ.1.45లక్ష ఖర్చు అవుతుందని, అందులో ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడి ఇస్తుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ యోజన పథకం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి, వారి వద్ద నుండి దరఖాస్తులను నమోదు చేయించాలని కోరారు. ఈ



మాట్లాడుతున్న డోన్ సబ్ డివిజన్ ఇంజనీర్ నాగేంద్ర

సమావేశంలో రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి, జేఈలు నాగరాజు, శివ, కుషిదర్, లైన్ ఇన్స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రామాంజినేయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# వసుధాఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసిన టంగుటూరి శీనయ్య

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో వసుధా ఫౌండేషన్ ఛైర్మెన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహకారంతో జోలాపురం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళకు రూ.10వేల రూపాయలు బనగానపల్లె పట్టణానికి చెందిన చాంద్ బాషాకు రూ.10వేల రూపాయలు, వడ్డె మాధవికి రూ. 10వేల



చెక్కును అందజేస్తున్న దృశ్యం

చొప్పున రూ.30వేల రూపాయలు అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున వారికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ గతంలో కూడా వసుధా ఫౌండేషన్ తరపున విద్యార్థులకు పుస్తకాలు మరియు ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందని దీనికి సహకరించిన పెండేకంటి రమన్ కుమార్‌కు ప్రత్యేక అభివాదాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ నాగరాజు, తిరుమలయ్య, హర్ష పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు గార్గేయపురం విద్యార్థిని

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** కర్నూలు మండలంలోని గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థిని ఫర్హాన జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనటుల పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు. గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. తమ పాఠశాల విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు బుధవారం విద్యార్థిని ఫర్హానను అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం, పీడీ వెంకటేశ్వర్లు రూ.1500లు నగదు అందజేశారు.



# నేషనల్ అచీవ్మెంట్ సర్వే



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలోని ఆరు పాఠశాలల్లో నేషనల్అచీవ్‌మెంట్ సర్వే 2024 సంబంధించిన పరీక్షను నిర్వహించడం జరిగినది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాగలమర్రి యందు 6వతరగతి విద్యార్థులకు ఎస్ పి జి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ముత్యాలపాడు నందు 6 మరియు 9వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలచెరువు నందు 9వ తరగతి విద్యార్థులకు రాఘవేంద్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, ఆర్.సి.ఎం ఎయిడెడ్ పాఠశాల పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద బోధనం నందు 3వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించడం జరిగినది. ఈ పరీక్షకు 179 విద్యార్థులు హాజరు కావడం జరిగింది. పరీక్ష నిర్వహణకు గాను ఏడుగురు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను మరియు ఏడుగురు అబ్జర్వర్లను నియమించడం జరిగినది. ఎంఈఓ 1 అనురాధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాగలమర్రి , రాఘవేంద్ర ఎయి డెడ్ ప్రాథమిక పాఠశాలలను మరియు ఎంఈఓ 2 న్యామతుల్లా గారు ఆర్. సి. ఎం. ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతలచెరువు లను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించడం జరిగినది.నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం ద్వారా దేశంలోని విద్యా వ్యవస్థల పనితీరును తెలుసుకునే ఉద్దేశంతో జరుగుతుంది. ఇది భారత ప్రభుత్వం నిర్వహించే మూడేళ్లకు ఒకసారి జరుగే అధ్యయనం వారు వివరించారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలి



గోనెగండ్ల లోని వీధులలో పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** ప్రజలు అందరు పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా భావిం చాలని ఈవోఆర్డి ఆనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీదులలో పరసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కాలువలో నిండిన చెత్తను, ముళ్ల పొదలను ట్రాక్టర్, జేసీబీలతో తొలగించారు. ఈ సందర్బంగా ఈవోఆర్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు ఆయా గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ లాంగ్ ్బషా, అనిల్, సుబాన్, అనిల్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సుందర ఎమ్మిగనూరు.. మా లక్ష్యం

**సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ**



లైటింగ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరును సుందరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని, ప్రతి వార్డును, ప్రతి రహదారిని విద్యుత్ కాంతులతో విరజల్లెల చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 26, 27వ వార్డులో దాదాపు 25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన లైటింగ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి సెంట్రల్ లైటింగ్ ద్వారా వెలుగులను ప్రసరింప చేస్తుందన్నారు. ప్రతి వార్డును వెలుగులు నింపేలా చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,డిఈ. రాజు నాయక్, ఏఈలు శరత్‌చంద్ర, మదన్,కౌన్సిలర్లు,టీడీపీనాయకులుతదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీ యాక్టుపై అవగాహన కార్యక్రమం

**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** మండల కేంద్రమైన దొర్నిపాడులోని వ్యవసాయ శాఖ కార్యాలయం నందు డీలర్లకు మండల వ్యవసాయ అధికారిని ప్రమీళ ఆధ్వర్యంలో ఆర్టీఐ యాక్టుపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని ప్రమీళ మాట్లాడుతూ ఆర్టీఐ యాక్టు 2005 ద్వార ప్రభుత్వానికి సంబంధించి ఏదైనా సమాచారం పొందే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని మరియు డీలర్లందరూ తప్పనిసరిగా స్టాక్ రిజిష్టరు మరియు ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రషీదు ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ప్రమీళ, మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణ యజమానులు , వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల డిమాండ్లను పరిష్కరించాలి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** దివ్యాంగుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ బుధవారం కోవెలకుంట్ల ఇన్‌చార్జీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు దేవరాజ్ మాట్లాడుతూ దివ్యాంగులకు గత రెండు ప్రభుత్వాలు కూడా పెన్షన్ మాత్రమే ఇస్తున్నారని, ఏ ఒక్క డిమాండ్ నేరవేర్చడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల బ్యాక్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలని, దివ్యాంగులకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని, త్రీ వీలర్స్ స్కూటీలు, ట్రై సైకిళ్ళు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు వెంకటేష్, పుల్లన్న, కృష్ణారెడ్డి, హుసేన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 6 నుండి రెవెన్యూ సదస్సులు


తహశీల్దార్ డి.చంద్రశేఖర్

**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గ్రామాలలో ఈ నెల 6 నుండి రెవెన్యూ సదస్సులను నిర్వహి స్తున్నామని తహశీల్దార్ డి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 6న అమకతాడు ,7న మన్నెకుంట,10న చిట్యాల ,11న ఎరకలచెరువు ,12 న క్రిష్ణగిరి, 13న లక్కసాగరం,17 న కటారుకొండ,18న చుంచుఎర్రగుడి ,19న కంబాలపాడు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తామన్నారు. అలాగే 20న ఆలంకొండ ,21న తొగర్చెడు,27న పోతుగల్లు,28న ఆగవెలి,జనవరి 2న టి..గోకులపాడు,3న ఎస్.హెచ్.ఎర్రగుడి గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ డి.చంద్రశేఖర్ తెలిపారు.

# మహిళలు బాలబాలికల భద్రత అందరి బాధ్యత..


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** మహిళలు బాలబాలికల భద్రత్య అందరి బాధ్యత అని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించాలన్నారు. బాల్యవివాహాలు, బాలల భిక్షాటనను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బాలికలకు గుడ్డేచ్బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని, మహిళలు బాలికల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలని అందుకు ప్రజల సహాకారం ఎంతో అవసరం అన్నారు. కొంత మంది పిల్లలు తెలిసో తెలియకనో యువతి యువకులు ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లోనుంచివెళ్లిపోతున్నారని కావున పిల్లలకు ఇలాంటి పరిణామాలపై అవగాహన తల్లిదండ్రులు కల్పించాలన్నారు పిల్లల పై ఆఘాయిత్యాలు, బాల్యవివాహాలు,వరకట్న వేధింపులు లైంగిక వేధింపులు, నివారించడానికి గ్రామాలలో సమావేశాలు జరిపి ప్రజలలో అవగాహన తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. బాలికల రక్షణ కోసం చైల్డ్ లైన్ కోసం 1098 కిగాని హెల్ప్ లైన్ 181కు గాని పోలీస్ డయల్ 100 గాని సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## పశుగ్రాస సాగు పథకం గురించి పాడి రైతులకు అవగాహన కల్పించండి

**- ఉప సంచాలకులు డాక్టర్ డి.వి.రమణయ్య**




**బనగానపల్లె,మేజర్ న్యూస్ :** ఉపాధిహామీ పథకం కింద బహు వార్షిక పశుగ్రాస పెంపకం పథకం గురించి పాడి రైతులకు అవగాహన కల్పించాలని ఆళ్లగడ్డ డివిజన్ ఉప సంచాల కులు డాక్టర్ రమణయ్య తెలిపారు. బుధవారం బనగానపల్లె పశు వైద్యశాలలో సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో పాడి రైతులు 10 సెంట్ల నుండి 50 సెంట్ల వరకు గడ్డిని పెంచుకోవచ్చని,ఇందుకు అగు కూలీలు, మెటీరియల్ ఖర్చుల నిమిత్తం ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. బనగానపల్లె పశువైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారామ్ మాట్లాడు తూ 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమంను ఎన్యుమరేటర్లు త్వరగా పూర్తి చేయాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ బ్రహ్మానంద రెడ్డి, డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి, డాక్టర్ చిన్న బాబు, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కెసి కెనాల్‌లో యువకుడు గల్లంతు

**పాములపాడు, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామం వద్ద యువకుడు గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానపాడు గ్రామానికి చెందిన కురువ మధు (22) కంబాలపల్లి గ్రామంలో బంధువుల అంత్యక్రియలలో పాల్గొని గ్రామం పక్కనే ఉన్న కేసీ కెనాల్ లో స్నానం నిమిత్తం వెళ్లి గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది యువకునికి ఇటీవలే నిశ్చితార్థం అయినట్లు బంధువులు తెలిపారు. అంతక్రియలకు వచ్చి యువకుడు గల్లంతు కావడంతో బంధువులలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# యురేనియం తవ్వకాలకు ప్రజలు నిరాకరణ


గ్రామసభలో మాట్లాడుతున్న టిడిపి నాయకుడు జయరాముడు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః**

మండల పరిధిలోని జక్కసానికుంట్ల, మామిళ్లపల్లె, రాంపురం గ్రామాలలో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని, యురేనియం తవ్వకాలకు గ్రామాల ప్రజలు నిరాకరించారు. ఈ సందర్భంగా బుధవారం జక్కసానికుంట్ల గ్రామంలో గ్రామసభను ఏర్పాటు చేయడంతో మూడు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి గ్రామ సర్పంచ్ వై.జయమ్మ అధ్యక్షతన యురేనియం తవ్వకాలు నిలిపివేయాలంటూ, అందుకు మేము వ్యతిరేకిస్తున్నామని ఈఓఆర్‌డి బాలకృష్ణ సమక్షంలో సంతకాలు చేసిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి టిడిపి నాయకడు జయరాముడు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే, పచ్చని పొలాలను నాశనం చేసే యురేనియం తవ్వకాలను ఒప్పుకునే ప్రసక్తేలేదన్నారు. ఈ సభలో ఎంపిటిసి విజయలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, విఆర్‌ఓ సుదర్శన్, నాయకులు రామకృష్ణ, మహేష్‌యాదవ్, ఆదిరెడ్డి, రాంపురం నాగేశ్వరరావుయాదవ్, భాస్కర్‌రెడ్డి, మామిళ్ళపల్లె శ్రీనివాసులు, రాజు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు



**పాములపాడు,మేజర్‌న్యూస్:** మండలంలోనివేంపెంట, గుండాలనట్టు తండా, చెలిమెల్ల,లింగాల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో ఆకు ఎండు తెగులు నివారణకు క్లోరోథాలనిల్ లేదా ధయోఫినేట్ మిథైల్ ఒక ఎకరానికి 400 గ్రాముల చొప్పున 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి అన్నారు. కందిలో ఎండు తెగులు నివారణకు ఎండు తెగులు సోకిన మొక్కలను పీకి వేసి కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటికి లేదా 600 గ్రాములు ఎగరానికి లేదా కార్బన్డిజం 200 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత మాట్లాడుతూ మినుములో కాండపు ఈగ నివారణకు దుక్కిలో ఎకరానికి 10 కేజీల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలి. పైరు మొలిచిన తర్వాత పురుగు లక్షణాలు కనిపిస్తే డైమిదోయేట్ 400 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 300 గ్రాములు ఎగరానికి పిచ్చిగారి చేయాలి. మినుములో పల్లకు తెగులు రాకుండా ముందు జాగ్రత్తగా ఎకరానికి 20 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలు పొలంలో పెట్టాలి మరియు పైరు లేత దశలో వేప నూనె 5 ఎంఎల్ నీటికి కలిపి పిచికారి చేస్తే సరిపోతుందన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మద్దిలేటి, రైతు సేవ కేంద్ర సిబ్బంది మధు నాయక్ ,విజయ్, సునీత పాల్గొన్నారు.

# వీరారెడ్డిపల్లె పాల సొసైటీ ఎన్నికల్లో విజయ ఢంకా మ్రోగించిన టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** శిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామపంచాయతీలో బుధవారం జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ ఢంకా మ్రోగిం చింది. విజయ పాల డైరీ జిల్లా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు మధ్య జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సునాయాసంగా విజయం సాధించి తమ అభ్యర్థులను విజయపతాన నిలుపుకున్నది. వీరారెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఉన్నటువంటి పాల డైరీ సొసైటీ సుదీర్ఘకాలంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాల సొసైటీ ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేయడం పట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిల ప్రియ,భార్గవ్ రామ్ నాయుడు,భూమా జగత్ విఖ్యాత రెడ్డి, శిరివెళ్ల మండల టిడిపి కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి పాల సొసైటీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి తమ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు,భూమా అభిమానులకు, కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డికి పాల సొసైటీ సభ్యులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కొండమడుగుల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్, ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ తన పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు.

# మామిడి తోటను పరిశీలించిన ఉపాధి హామీ పిడి జనార్ధన్



**గడివేముల మేజర్ న్యూస్:** మండలంలోని గడివేములకు చెందిన రైతు ఇద్రుస్ భాష పొలంలో వేసిన మామిడి తోటను బుధవారం నాడు ఉపాధి పిడి జనార్ధన్ ఎంపీడీవో వాసుదేవగుప్త పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నందు ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిడి జనార్ధన్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో రైతులకు సంబంధించిన పంట పొలాలలో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కాలువ పనులను మరియు రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పించాలన్నారు. జాబ్‌కార్డ్ లేనివారికి జాబ్ కార్డు ఇప్పించాలని జాబ్ కార్డు ఉన్నప్రతి ఒక్కరు ఉపాధి పనికి వెళ్లాలని అన్నారు. గ్రామాలలో వలసలు వెళ్లకుండా ఉపాధి పని చూపించాలని సిబ్బందిని కోరారు. ముఖ్యంగా మండలంలోని అన్ని గ్రామాలలో గోకుల షెడ్లను మరియు గొర్రెల షెడ్లను నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి రికార్డులను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.ఎ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించండి



పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** కొలిమిగుండ్ల మండలం నాస్ పరీక్షలను నిర్వహిస్తున్న పాఠశాలలను మండల విద్యాధికారి అబ్దుల్ కలాం విస్తృతంగా పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు అలాగే అబ్జర్వర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది. మండలంలో బెలుం మెయిన్ స్కూలు నందు మూడవ తరగతి విద్యార్థులకు అలాగే ఏపీ మోడల్ స్కూల్ నందు 6,9 తరగతిల విద్యార్థులకు ఆల్ట్రాటెక్ స్కూల్ నందు 9వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఈ పరీక్షకు 30 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా మండల విద్యాధికారి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పిలు మద్దిలేటి, కమల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు గ్రామీణ సీఐగా బాధ్యతలు స్వీకరణ


రూరల్ సీఐగా మధుసూదన్ రావు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు గ్రామీణ నూతన సీఐగా బీవీ. మధుసూదన్ రావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కొద్దీరోజులే పనిచేసిన సీఐ విక్రమ్ సింహ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఈయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కఠిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడవద్దని ఎమ్మెల్యే సీఐకు సూచించారు.

## నాటక అకాడమీ ఛైర్మెన్‌గా గోపాలక్రిష్ణ

**కర్నూలు కల్చలర్, మేజర్‌న్యూస్:**

నాటక ఆకాడమీ చైర్మన్‌గా ఉమ్మడి గోపాలక్రిష్ణ బుధవారం విజయవాడలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కర్నూలు టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యవర్గ సభ్యులు రాజారత్నం, సంఘ ఆంజనేయులు, వి.రాముడు, జీవీ.శ్రీనివాసరెడ్డి ఉమ్మడి గోపాలక్రిష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా నంది నాటక పోటీల్లో ఉగాది పురస్కారాలు కళాకారులకు అందించాలని కోరారు.

# భూ సమస్యల పరిష్కార దిశగా రెవెన్యూ సదస్సులు

## – డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ప్రాథమిక ఉద్దేశంతో ప్రభుత్వం ఈనెల 6 నుంచి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా రెవెన్యూ సదస్సులపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూ వివాదాలను పరిష్కరించేందుకు ప్రబుత్వం పెద్ద ఎత్తున ఈనెల 6 నుంచి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈమేరకు సెక్షన్ 22ఏ భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సులలో పాల్గొని అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులను రియల్ టైమ్ గవర్నెస్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్‌లోని ప్రత్యేకవిండోలో ఆన్‌లైన్‌లో పొందుపరిచి ఉంచడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అర్జీకి రశీదు ఇవ్వడంతో


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

పాటు స్వీకరించిన అర్జీలను 45రోజులలో పూర్తిస్థాయిలో విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రతి భూ సమస్యకు ఉత్తర్వులు కూడా మంజూరు చేస్తామన్నారు. ఏదేని గ్రామంలో రీ సర్వే నిర్వహించినట్లయితే కొత్తగా తయారు చేసిన ఆర్ఓఆర్‌ను చదివి వినిపించడంతో పాటు వాటిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు. భూ వివాదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు రెవెన్యూ బృందాలు ప్రయత్నించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరించడంతో పాటు భూదందాలకు స్వస్తి పలికినట్లు అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# నూతన భవనంలోనే ప్రజలకు వైద్య సేవలు అందించాలి

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- సిహెచ్‌సిలో అందించే వైద్య సేవలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి
- సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవు
- వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండల కేంద్రంలో నిర్మించిన నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనంలోనే ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సమస్యలపై చర్చించారు. 24 గంటలు విద్యుత్తు సరాపర అయ్యేవిధంగా ప్రత్యేక లైను ఏర్పాటు చేయాలని, రోగులకు అత్యవసర చికిత్స నిమిత్తం అల్ట్రాసౌండ్, ఎక్సరే పరికరాలను ఏర్పాటు చేయాలని, ఇన్వర్టర్ సదుపాయం, ప్రజలకు కనిపించే విధంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నేమ్ బోర్డు, ఆవరణలో విద్యుత్ దీపాలు, పాత అంబులెన్స్ ను ఆస్పత్రి ఆవరణ నుంచి తొలగించాలని సూచించారు. ఎస్సై సునీల్ కుమార్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించే విధంగా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పోస్టుమార్టం కు కావలసిన సదుపాయాలు అటెండర్ లేరని





ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ అందుబాటులో ఉండే సమయాలను పట్టికలో పొందపరచాలని గ్రామాలలో సిహెచ్సిలో అందించే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని టిడిపి నాయకులు కార్యకర్తలు డాక్టర్లకు సూచనలు చేశారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్సై సునీల్ కుమార్, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ షర్మిలారెడ్డి ,మెడికల్ ఆఫీసర్ మంజుల, వైద్యులు అశ్విన్, శ్రీకాంత్, దాదాభాషా, నవ్య తేజ, టిడిపి నాయకులు గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, రాంభూపాల్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం

## – న్యాయ శాఖ కార్యదర్శితో మంత్రి ఫరూక్ సమీక్ష


న్యాయ శాఖ కార్యదర్శితో మంత్రి సమీక్ష

**నంద్యాలఅర్బన్, మేజర్‌న్యూస్ :** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటును వేగవంతం చేయడానికి శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ విభాగం కార్యదర్శి ప్రతిభా దేవితో మంత్రి సమీక్ష నిర్వహించారు. బుధవారం ప్రతిభా దేవిని మైనార్టీ సంక్షేమ శాఖ కమీషనర్ సీహెచ్ శ్రీధర్‌తో కలిసి ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధాని అంటూ ప్రజలను మభ్యపెట్టడం జరిగిందని అన్నారు. తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటుపై ప్రభుత్వం శాసన సభ, శాసన మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిందని అన్నారు. బెంచ్ ఏర్పాటుపై పకడ్బందీగా కార్యాచరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో న్యాయపరమైన సేవలు సీమ జిల్లాల ప్రజలకు అత్యంత చేరువ కానున్నాయని అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ కమీషనర్ శ్రీధర్‌తో వక్ఫ్‌బోర్డు పునఃనిర్మాణంపై మంత్రి చర్చించారు.

# సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటాం


తనిఖీ నిర్వహిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వాసుపత్రిలోని డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరిం టెండెంటె డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విభాగంలోని రిపోర్టులను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించేలా ఏవోకు ఆదేశించారు. ఆసుపత్రి సిబంది పని వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది విధి నిర్వహణలో ఎవరైనా బయటకు వెళితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మినిస్ట్రీరియల్ స్టాఫ్ సిబ్బంది విధులను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, అకౌంటెంట్ లతీఫ్‌బేగ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళలు, బాలబాలికల భద్రతకు

# సమన్వయంతో పని చేయాలి : జిల్లా ఎస్పీ


తనిఖీ నిర్వహిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** మహిళలు, బాలబాలికల భద్రతకు, రక్షణకు సమన్వయంతో పనిచేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని చైల్డ్ వెల్ఫేర్‌కమిటీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఐసీడీఎస్, విద్యాశాఖ, లేబర్ డిపార్ట్‌మెంట్, అంగన్‌వాడి టీచర్స్, అంగన్‌వాడి వర్కర్లు, కస్తూరిగాంధీ విద్యాలయ శాఖల సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలల భిక్షాటనను పూర్తిగా నిర్మూలించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య దశను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. అనంతరం లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలను ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమలలో ఆయా శాఖల అధికారులు జుబేదాబేగం, శామ్యూల్‌పాల్, శారద, నీలకంఠేశ్వర్, సీఐలు ప్రసాద్, శివశంకర్, విజయలక్ష్మి, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదు...

- ★ కమీషనర్‌పై వైకాపా కౌన్సిలర్ల గరం... గరం
- ★ వాడివేడిగా కౌన్సిల్ సమావేశం
- ★ గేటుకు తాళంపై కౌన్సిల్‌లో దుమారం
- ★ వైకాపా సభ్యులతో వైస్ ఛైర్మెన్ కొట్రికే హరికిషన్ వాగ్వివాదం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** మున్సిపల్ కమీషనర్ ప్రసాద్‌గౌడ్ వ్యవహారశైలి పై వైయస్ఆర్‌సిపి కౌన్సిలర్లు మండిపడ్డారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదని తేల్చిచెప్పారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రసాద్‌గౌడ్ ఏకపక్ష వైఖరిపై ఛైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ ఛైర్మన్ జాకీర్‌హుస్సేన్‌తో పాటు వైయస్ఆర్‌సిపి కౌన్సిలర్లు అందరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల దృష్టికి తీసుకురాకుండా కౌన్సిల్ మీటింగ్ రద్దు పరచడం, అజెండాలో అంశాలను చేర్చడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మార్నింగ్ వాక్ కోసం మున్సిపల్ కార్యాలయం వచ్చినప్పుడు గేటుకు తాళం


వైస్ ఛైర్మన్ హరికిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైకాపా కౌన్సిలర్

వేయడాన్ని సభ్యులందరూ తీవ్రంగా తప్పుపట్టారు.


ఎవ్వరి దయతో ప్రజాప్రతినిధులం కాలేదంటున్న కోట్రికే హరికిషన్

అందులోనే మున్సిపల్ వైస్‌చైర్మన్ కోట్రికే హరికిషన్ కలగజేసుకోవడంతో కౌన్సిల్‌లో చిన్నపాటి దుమారం చెలరేగింది, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దయ, దాక్షిణ్యాలతో తాము పదవులు పొందలేదని, ప్రజలు ఆదరిస్తేనే ప్రజా ప్రతినిదులయ్యామనీ చెప్పుకొచ్చారు. అనంతరం కొంతమంది కౌన్సిలర్ల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.